పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కోడుగంటి గోవిందరావు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం పుస్తకావిష్కణ జిల్లా కేంద్రంలో గల కోడిగంటి గోవిందరావు భవనంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అధ్యయన కేంద్రం కో కన్వీనర్ సన్యాసిరావు స్వాగతం పలికారు. అనంతరం అధ్యయన కేంద్రం కన్వీనర్ రాజాన దొరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ డి.హెచ్. రాజబాబు, మళ్ళ మాధవరావు, ఆర్.శంకరరావు, భద్రం, బాలు, చంద్రశేఖర్, చిన్ని యాదవ్, మాణిక్యాలరావు, అప్పారావు, శివరాం మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చాలా దారుణమైన సంఘటనగా అభిప్రాయపడ్డారు. పాలస్తీనాలో చిన్నారులపై ఇజ్రాయిల్ దేశం కురిపించిన బాంబుల మోతతో మానవాళిని కదిలిస్తుందన్నారు. అమెరికా తన యుద్ధ సామగ్రి అమ్మకాల కోసం ప్రపంచంలో పొరుగు దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పాలస్తీనా భారత దేశం స్నేహ బంధం గల దేశమైన ఇజ్రాయిల్ దేశానికి మద్దతుగా నిలవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సుజన కోట పంచాయతీ వనుగుపుట్టు గ్రామంలో ఆయన పర్యటించి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ సమాచార హక్కు చట్టం 2005, 1/70 చట్టం, పీసా చట్టం, వినియోగదారుల చట్టం 2009 వంటి పటిష్టమైన చట్టాల పట్ల గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గూర్చి ప్రతి ఒక్క పౌరుడు తెలుసుకోవాలన్నారు. యువత చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు చదువుతో పాటు చట్టాలను గురించి కూడా తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన మండల కార్యవర్గ సభ్యులను ఎన్ను కున్నారు. నూతన కమిటీ కార్యవర్గంలో గంపరాయి కోటేశ్వరరావు, తాంగుల జయరాం, గంపరాయి రమేష్ కుమార్, కిల్లో ఆనంద రావు, కూడా మోహన్, రెయ్యల నాగభూషణం, సీసా రామకృష్ణ, వంతల రాజబంధు, పెనుమాలి దుర్గాప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

ప్రతిభా సామర్థ్యమా...? రాజకీయ, సామాజిక వర్గ సమీకరణమా..?

- ఏయూ వీసీ ఎంపికలో దేనికి పెద్దపీట

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్ ఎంపిక ప్రక్రియలో అభ్యర్థి ప్రతిభ, సామర్థ్యాలకి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారా.. లేదా వీసీ ఎంపికలో రాజకీయ సామాజిక వర్గ సమీకరణలు కీలకంగా నిలుస్తాయా అనేది చర్చనీయాంశంగా మారింది. ఏయూ వైస్ ఛాన్సలర్‌గా ఎంపిక చేసే వ్యక్తి విషయంలో రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని రాజకీయ కోణంలోనూ, ఇటు సామాజిక వర్గ సమన్యాయం పాటిస్తూ నియామకం జరపాలని అధికార వైసీపీలోని కొందరు మంత్రులు, నాయకులు కోరుతున్నారు. ఇదే సమయంలో యూనివర్సిటీలో ఇప్పుడున్న అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రస్తుత ప్రాజెక్టులు నిలదొక్కుకునేలా చేయగల సమర్థుడైన ఆచార్యుని వీసీగా ఎంపిక చేస్తే బాగుం టుందని విద్యా వర్గాలకు చెందిన పలువురు సీనియర్ ఆచార్యులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిష్టాత్మక ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పాటుచేసి శతాబ్దానికి దగ్గర అవుతుండడం పట్ల వర్సిటీ నూతన రథసారథి విషయంలో ఈ అంశాలు కీలకంగా మారాయి. నాలుగేళ్ల క్రితం 2023 నాక్ ర్యాంకింగ్ ఆంధ్ర యూనివర్సిటీకి ఏమాత్రం ఆశాజనకంగా ఉండదని క్రితంసారి వచ్చిన ర్యాంకింగ్ కన్నా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని వర్సిటీ వర్గాలు భావించాయి. దీనికి బోధన సిబ్బంది కొరత ప్రధాన కారణమని, దీంతోపాటు వలు లోపాలను వర్సిటీ ఆచార్యులు చెప్పేవారు. అటువంటి పరిస్థితుల నుంచి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఇటీవల నాక్ ర్యాంకింగ్‌లో ఏ డబల్ ప్లస్ దేశంలోనే 3.74 సిజిపిఏతో అత్యున్నత స్థానంలో వర్సిటీ నిలచింది. ఏయూ గత నాక్ ర్యాంకింగ్ సమయంలో 2016-17లో శాశ్వత ప్రాతిపదికన 271 మంది ఆచార్యులు, 92 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 83 మంది సహాయ ఆచార్యులు, 328 మంది కాంట్రాక్ట్ / గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసే వారు మొత్తం బోధన సిబ్బంది 764 మంది యూనివర్సిటీలో పని చేసేవారు. 2022-23 సంవత్సరానికి గాను నాక్ ర్యాంకింగ్‌కి వెళ్లే సమయానికి శాశ్వత ప్రాతిపదికన 145 మంది ఆచార్యులు, 36 మంది అసోసి యేట్ ప్రొఫెసర్లు, 14 మంది సహాయ ఆచార్యులు కేవలం 195 మంది మాత్రమే బోధన సిబ్బంది యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బోధన సిబ్బంది కొరతను అధిగమించిందేకుగాను 58 మందిని లీన్/ అడ్జంక్ట్ ఆచార్యులుగా, 238 మందిని కాంట్రాక్టల్/ చైర్ ప్రొఫెసర్/ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పద్ధతిలో నియమించారు. నాక్ ర్యాంకింగు ఏడు ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకోగా మౌలిక సదుపాయాల అంశంలో 3.87, స్టూడెంట్ ప్రోగ్రెసన్ సపోర్ట్ అంశంలో 3.85 స్కోరు సాధించగా, బెస్ట్ ప్రాక్టీసెస్ విషయంలో 4/4 స్కోర్ సాధించింది. నాక్ నిర్వహించిన స్టూడెంట్ ఇన్ డైరెక్టర్ శాటిస్ ఫాక్షన్ సర్వేలో 3.71 స్కోర్ సాధించింది. మిగిలిన అన్ని అంశాలలో మంచి స్కోరు పొందితే, బోధన సిబ్బంది కొరత కారణంగా ఒక్క టీచింగ్ విషయంలోనే తక్కువ స్కోరు సాధించడం జరిగింది. అయినప్పటికీ అత్యుత్త మమైన నాక్ ర్యాంకింగ్ యూనివర్సిటీ సొంతం చేసు కుంది. దీని వెనక బోధనా సిబ్బంది కొరతను అధిగ మించడానికి చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, విద్యా పరిశోధన ప్రాజెక్టులు మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రాజెక్టులు కీలకంగా నిలిచాయి. ఇదంతా కొన్ని సంవత్సరాల పాటు అహర్నిశలా కృషి, దార్శనికతతోనే సాధ్యపడింది తప్ప తేలిగ్గా జరగలేదు. ఎన్నో సంవ త్సరాల నుండి అధ్యాపకుల భర్తీ లేదు. శాశ్వత ప్రాతి పదికన అధ్యాపకులు లేకుంటే నాక్ గ్రేడ్ రావడం చాలా కష్టం అటువంటి తరుణంలో ఎన్ని విమర్శలు వచ్చినా అత్యున్నత నాక్ గ్రేడ్ సాధనే లక్ష్యంగా కొంత మందిని హానినరీ ప్రొఫెసర్లుగాను, అడ్జక్ట్ ప్రొఫెసర్లుగాను, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాల నుంచి వచ్చిన వారిని యూనివర్సిటీలో బోధన సిబ్బందిగా తీసుకు రావడం బోధన సిబ్బంది కొరతను అధిగమించ డానికి విశేషంగా తోడ్పడింది.

దీనికి తోడు చైర్ ప్రొఫెసర్లు, స్టార్ట్ అప్ ఇంక్యుబేషన్ సెంటర్, ఎలిమెంట్ తరహా ప్రాజెక్టులు, పరిశోధన అవకాశాలు పెంచే టిడిఆర్ హబ్, విద్యార్థులకి ప్లేస్మెంట్స్ ఇవన్నీ కూడా నాకు ర్యాంకింగ్ విషయంలో తమ వంతు పాత్ర పోషిం చాయి. ఇలా అన్ని విభాగాలను పటిష్టంగా బలోపేతం చేసి కొన్ని సంవత్సరాలు పాటు చేసిన కృషి ఫలితమే ప్రస్తుత ఏయూ నాక్ ఏ డబల్ ప్లస్ ర్యాంక్. మరి ఇంతటి ఘన కీర్తిని మరికొన్నాళ్లు నిలదొక్కుకునేలా చేయడం అంటే ఆషామాషీ కాదని సీనియర్ ఆచా ర్యులు చెబుతున్నారు. ఏయూ ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా రాజకీయ సామాజిక వర్గ సమీకరణాల కూర్పు పక్కన పెట్టి ప్రతిభ, సమర్థతకు మాత్రమే పెద్ద పీట వేయా లని, ఆమేరకు మాత్రమే వైస్ ఛాన్సలర్ ఎంపిక ఉం డాలని వర్సిటీ వర్గాలు ముక్తకంఠంతో కోరుతున్నాయి.

మాజీ ఎమ్మెల్యే 'పైలా'కు ఘన నివాళి

విశాలాంధ్ర - పరవాడ: దివంగత మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడు 19వ వర్ధంతిని పరవాడ సంతబయలు వద్ద ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని పైలా కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పైలా యువసేన స్థానిక పీహెచ్‌సీలోని రోగులకు, బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, పార్టీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, నాయకులు బైలపూడి భగవాన్ జయరాం, చుక్క రామునాయుడు, సిరిపురపు అప్పలనాయుడు, నదియా, కోన రామారావు, కూండ్రపు సీతారామయ్య, పెదిశెట్టి శేఖర్, గొర్లి గోపి, గొర్లి ఎరుకునాయుడు, బండారు రాజశేఖర్, గొల్లవిల్లి శ్రీను, బొద్దపు చిన్నారావు, బొంది అచ్చిబాబు, వెన్నెల సన్యాసిరావు, బండారు రామారావు, సప్పా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరావు మాస్టరుకు సన్మానం

విశాలాంధ్ర - భీమిలి: సీతారామరాజు నగర్ యోగ 9వ వార్షికోత్సవం సందర్భంగా సీతారామరాజు నగర్ పార్కులో భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ప్రసాద్‌రావు మాస్టారుకి సన్మానం జరిగింది. ఈ వార్షికోత్సవంలో 91వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతిలో భాగమని తెలిపారు. సీతారామరాజు వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించే దివ్య ఔషధంగా యోగ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షులు టి.ఎస్.వి.ప్రసాదరావు, ఎన్‌వైఎస్ అధ్యక్షులు తురగా సాయి, సీతారామరాజు నగర్ యోగ గురువు నాగేశ్వరరావు, సోమే శ్వరరావు, గురువులు ప్రభాకర్, నాయుడు లతా, దొరమ్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిముక్కులో బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్థానిక 75వ వార్డు నెల్లిముక్కు గ్రామంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ అధికారంలోకి వస్తే ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్ సౌకర్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, జిల్లా నాయకులు పెద్దాడ సోము నాయుడు, గోక్యాడ ముత్యాలు, ములకలపల్లి పెంటయ్య, అండిబోయిన రాము నాయుడు, మొల్లి రమణ, బస అప్పల రెడ్డి, మొల్లి అప్పల నాయుడు, మొల్లి రమణ, పెదపూడి అప్పల స్వామి, సూరి బాబు, కాకినాడ అప్పల రాజు, దొమ్మేటి సోము నాయుడు, పులి సురేష్ రెడ్డి, పులి శ్రీరామ రెడ్డి, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం... ప్రతి ఒక్కరికి ప్రాణదానం

విశాలాంధ్ర - చింతపల్లి: హెల్పింగ్ హ్యాండ్స్, గిరిజన ఉద్యోగుల సంఘం చింతపల్లి, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో చింతపల్లి గిరిజన భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో లెని చిల్డ్రన్ హోంలో ఉన్న అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. అనంతరం స్థానిక డిగ్రీ కళాశాల ఆశ్రమ వసతి గృహ అధికారి గసాడి తిరు పతిబాబు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు విద్యకు సంబంధించిన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు టి.మల్లేష్, ప్రతినిధులు తిరుపతి బాబు, పి.చిట్టయ్య, బి.సింహాచలం, కే.జాన్, జీవీఎన్ ప్రసాద్, చింతపల్లి గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బౌడు గంగరాజు, పీఆర్‌టీయూ అల్లూరి జిల్లా అధ్యక్షుడు యూ.వీ.గిరి, కుడుముల కాంతారావు, ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.ఈశ్వర్రావు, కె.వెంకటరమణ, కె.మత్సలింగం, చేయూత వారియర్స్ ట్రస్ట్ చైర్మన్ డి.రమణ, బాకురు పాండురాజు, సురకత్తి రాము పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్న పాలెం కూడలి వద్ద చేపడుతున్న దీక్షలు 1032వ రోజుకు చేరుకు న్నాయి. విశాఖ ఉక్కు శ్రామిక సంఘం, టీఎన్‌టీయూసీ, కాంట్రాక్టు కార్మికులు దీక్షలో కూర్చున్నారు. టీఎన్‌టీ యూసీ అధ్యక్షులు ఎం.కోటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కరణం సత్యారావు, లేబర్ యూనియన్ అధ్యక్షుడు బొడ్డు రమణ, జె.రామక్రిష్ణ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు శ్యాంసుందర్ దంపతులు, రాజశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు దర్శించుకున్నారు. వీరికి కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఘనస్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని బేడా ప్రదక్షిణ చేశారు. స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చేయించారు. ఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి సర్వం సిద్ధం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో కొలువైయున్న శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి దీపోత్సవం డిసెంబర్ 12వ తేదీన జరగనుండగా దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు స్థానిక భీమిలి నియోజక వర్గపు ఇన్చార్జ్ ముత్తంశెట్టి మహేష్ పరిశీలించారు. భక్తు లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవం తంగా ఏర్పాటు చేశామని ఈవో నానాజీ, ఆలయ కమిటీ వారు అన్నారు. భద్రతాపరమైన ఏర్పాట్లు, ట్రాఫిక్, వాహ నాలు దారి మళ్లింపు, వాహనాల పార్కింగ్ వంటి ఏర్పా ట్లు ఏర్పాటు చేశామని స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ సన్యాసి నాయుడు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇబ్బంది పడకుండా సర్వం సిద్ధం చేసినట్లు తహశీల్దారు వేణుగోపాల్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ పద్దు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి: గ్రేట్ థాట్స్ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి సుమారు 40 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు కార్పొరేటర్ సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ శిబిరంలో సేకరించిన 40 యూనిట్లు రక్తాన్ని చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. ఈ శిబిరంలో విశాఖ చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, గ్రేట్ థాట్స్ ఆర్గనైజర్ లీలా గంగాధర్, రవి, రాంబాబు, సాంబశివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు యాత్ర



విశాలాంధ్ర - గొలుగొండ: ఎంవీఆర్ ట్రస్ట్ అధినేత ముత్యాల వెంకటరావు అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం అమ్మపేట గ్రామానికి ఒక బస్సు పంపించి తమ సొంత ఖర్చులు వెచ్చించి వెంకటేశ్వర స్వామి గుడి అన్నవరం నిరుపేద లను దర్శనం నిమిత్తం పంపించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్ కూడా ఏర్పా టు చేసి 50 మందిని ఈ యాత్రలకు తీసుకెళ్తున్నారు.

ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్/సెక్రటరీలను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులుగా గుర్తిం చాలని గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.మల్లి కార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శి మంజునాథులు డిమాండ్ చేశారు. ఆదివారం శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల నందు19 శాఖల ఉద్యోగులను నియమించి వారి ద్వారా ప్రజలకు మెరుగైనటువంటి సేవలను అందిం చేందుకు గాను నూతన వ్యవస్థను తీసుకు వచ్చి ందని వారన్నారు. అయితే సచివాలయ ఉన్నతాధి కారులు ఇందులో పనిచేస్తున్న 18 శాఖల ఉద్యోగుల పనితీరును పర్యవేక్షిస్తూ వారి సమస్యలను కూడా తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉన్నారని అయితే ఒక్క ఎనర్జీ సెక్రటరీలను విస్మరించి వారి బ్రతుకులను గాలిలో దీపాలుగా మార్చి వేస్తున్నారని వారన్నారు. సచివాలయ వ్యవ స్థలో భాగంగా ఎనర్జీ అసిస్టెంట్‌లను కూడా నియ మింపబడ్డారని, అందరికీ వర్తించే పనివేళలు, సెలవులు వర్తిస్తాయని అవేవి వర్తింపజేయకుండా విద్యుత్ సంస్థలు బ్రిటిష్ చట్టాలను అమలు చేస్తూ బానిసలకన్నా హీనంగా పనిచేయిస్తున్నారని వారు వాపోయారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల రమణ మాట్లాడుతూ ఎనర్జీ సెక్రటరీలు రాష్ట్ర వ్యాప్తంగా తమ ప్రాణాలను పణంగా పెట్టి నిత్యం ప్రమాదాల మధ్య పనిచేస్తున్నారని వారన్నారు. ప్రొబిషన్ డిక్లరేషన్ జీ.ఎస్.డబ్ల్యు.ఎస్. ద్వారానే చేసి ఎస్.ఆర్.లు ఓపెన్ చేయాలని, సచివాలయ ఉద్యో గులు మాదిరిగానే 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అమరావతి జేఏసీ నాయకులు సురేష్, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సూర్య ప్రకాష్, ప్రవీణ్, మణికంత, సురేష్, కృష్ణారావు, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరికలు అవాస్తవం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీ నుంచి 70 కుటుంబాలు వైసీపీలో చేరునట్లుగా వచ్చిన వార్తలు అవాస్తమని చౌడువాడ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు చల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు మాలపరెడ్డి శివ ఖండిం చారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు నామినేటెడ్ పదవులు పొందుతున్నారని, మిగిలిన వారికి ఈ పదవులు దక్కలేదని కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉన్నారని వారన్నారు. గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలు పటిష్టంగా ఉన్నాయని, ప్రజలలో ఉన్న ఆదరణ రోజు రోజుకి పెరుగుతుండడంతో అది చూసిన వైసీపీకి చెందిన చౌడువాడ నాయకులు తమ కార్యకర్తలలో మనోధైర్యం దెబ్బతీయుటకు ఇటు వంటి అలజడులు సృష్టిస్తున్నారని వారు అన్నారు. వారు వైసీపీ కండువా కప్పిన వారిలో ఏ ఒక్కరైనా టీడీపీ, జనసేన పార్టీలకు చెందినవారు ఉన్నట్లుగా నిరూపించగలరా అని చాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ దాడి ఏరుకు నాయుడు, జనసేన నాయకులు కుంచ అంజిబాబు, కుమార అర్జునరావు, గేదెల శ్రీనివాసరావు, అమరపల్లి రామారావు, బిశెట్టి రామ్, రామకోటి, వల్లంశెట్టి, రాము పాల్గొన్నారు.

ప్రజాగళంగా మారిన యువగళం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర - పాయకరావుపేట: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజల ఆదరాభిమానాలు పొంది ప్రజాగళంగా మారిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్.రామకృష్ణారెడ్డి అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర ఉత్తరాంధ్ర ముఖ ద్వారమైన పాయకరావుపేటలో సోమవారం నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. లోకేష్ చేపట్టిన పాదయాత్రకు కార్య కర్తల్లోనే కాకుండా ప్రజల్లో మంచి స్పందన కన్పి ంచిందన్నారు. ఈఏడాది జనవరిలో ప్రారం భమైన పాదయాత్ర 3వేల కిలోమీటర్లకు చేరుకు ందని తెలిపారు. ఈనెల 18వ తేదీతో ముగుస్తుందని, 20వ తేదీన పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు. 2024 ఎన్నికల తర్వాత వైసీసీ పార్టీ కనుమరు గవుతుందని తెలిపారు. టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ 11వ తేదీ సాయంత్రం 5గంటలకు నారా లోకేష్ పాదయాత్ర పాయకరావుపేట చేరుకుంటుందని తెలిపారు. 5కిలో మీటర్ల అనంతరం నామవరం గ్రామం వద్ద ఉన్న వైభవ్ లేఅవుట్‌లో రాత్రి బస చేస్తారని తెలిపారు. 12వ తేదీ నక్కపల్లి మండలంలో పాదయాత్ర కొనసాగుతుందని, రాత్రి అడ్డురోడ్డు వద్ద ఉన్న క్రిష్ లేఅవుట్‌లో బస చేస్తారని తెలిపారు. 13వ తేదీ ఎస్.రాయవరం మండలంలో పాద యాత్ర కొనసాగుతుందని తెలిపారు. నియోజక వర్గంలో పాదయాత్ర జాతీయ రహదారిపై కొన సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వర రావు, బొంది కాశీ విశ్వనాద్, దేవవరపు రాజబాబు, లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి వెంకటేష్, పల్లా విలియం కేరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర స్వామికి మహా అన్నాభిషేకం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో తాళ్లవలస పంచాయతీ శ్రీ మహా గణపతి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, కృష్ణశాలతో నూతనంగా నిర్మాణం చేసిన విశ్వేశ్వర స్వామికి ఆదివారం మహా అన్నాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 3500 మంది భక్తులకు అన్న ప్రసాదాల కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ధర్మకర్త ఆయల సోమయాజులు, నరేష్ శర్మ దంపతులు తెలిపారు.

రాష్ట్ర గవర్నర్‌కి ఐ.ఎన్.ఎస్. డేగలో ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు విశాఖపట్నం ఐ.ఎన్.ఎస్. డేగలో ఘన స్వాగతం లభించింది. విశాఖపట్నంలో జరిగే నేవీ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఐ.ఎన్.ఎస్. డేగ చేరుకున్న రాష్ట్ర గవర్నర్‌కు నగర మేయరు గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున, డీసీపీ ఆనంద్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్ పుష్పగుచ్ఛం ఐ.ఎన్.ఎస్ డేగలో స్వాగతం పలికారు.

వరద బాధితుడికి సహాయం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని దార్లపూడి గ్రామంలో ఇటీవల వచ్చిన మిచౌంగ్ తుఫాన్‌కి బంగారు నూకరాజు అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్య ఉద్దేశంతో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి బియ్యం కూరగాయలు, నిత్యాసర వస్తువులు, కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, సమతా సైనిక్ దళ్ టీం అధ్యక్షుడు గారా ప్రకాష్, జనరల్ సెక్రటరీ బిక్కవోలు విజయ్, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, టీం సభ్యులు అప్పారావు, గోపాలకృష్ణ, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో కట్టమంచి జయంతి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని నిర్వహించారు. ఏయూ పరిపాలనా భవనం వద్ద గల ఏయూ స్నాతకోత్సవ మందిరం ఆవరణలో కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్లు పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏయూ ఆచార్యులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర - అచ్యుతాపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు (బిజెపి నాయుడు) అన్నారు. ఆదివారం మండలంలో కొండకర్ల పంచాయతీలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన పాల్గొ న్నారు. రాష్ట్ర రాష్ట్ర బిజెపి సైనిక సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొంతిన భక్త సాయిరాం, మేరుగు కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు 138 బూత్‌లో ఆదివారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ పార్టీని బలోపేతం చేసి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మజ్జి సోమేష్, మహిళా అధ్యక్షులు సర్వసిద్ధి శ్రీ లక్ష్మీ, సీనియర్ నాయ కులు చింతలపూడి సత్యనారాయణ, బూత్ కన్వీనర్ నాగల్ నూకరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

గెడ్డలో గిరిజన మహిళ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట మండలం సంతారి మీదుగా ప్రవహిస్తున్న గెడ్డలో ఆదివారం గిరిజన మహిళ మృతదేహం లభ్యమయింది. చింతల వీధి గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు బట్టలు ఉతకడానికి ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గెడ్డ దగ్గరికి వెళ్లగా మహిళ మృతదేహం కనిపించింది. ఒక్కసారిగా పరుగులు తీసి గ్రామానికి వెళ్లి తమ బంధువులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బంధు వులు మహిళా మృతదేహాన్ని చూసి పాతకోట పంచాయతీ పనసపుట్టు గ్రామా నికి చెందిన ఏడే భీమన్న భార్య ఎడే భింలమ్మ(55)గా గుర్తించారు. తమ పొరుగు గ్రామమైన సంతారికి సొంత పని నిమిత్తం వెళుతూ గెడ్డ దాటేటప్పుడు గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు గెడ్డ ఉధృతిగా ప్రవహిస్తుండడం లోతు ఉన్నట్టు తెలియక దిగి మృత్యువాత పడి ఉండవచ్చునని గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన గిరి మహిళకు భర్త భీమన్న గత కాలంలోనే మృతిచెం దగా ముగ్గురు ఆడపిల్లలు సంతానం ఉండగా, ఇద్దరి అమ్మాయిలకు పెళ్లయింది. ఒక అమ్మాయికి మాత్రం ఇంకా పెళ్లి కావలసి ఉంది. గ్రామస్తులు హుకుంపేట పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న హుకుంపేట ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలు బంధువులకు అప్పగించారు. గిరిజన మహిళ మృత్యువాత తెలియగానే గ్రామం ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయింది.

సారూ....నేను బతికే ఉన్నాను.... రేషన్ కార్డులో నా పేరును జత చేయరూ....

విశాలాంధ్ర - ఆనందపురం: కుటుంబం కోసం రెక్కలు ముక్కలు చేసుకుని పనులు చేసుకుని కుటుంబ పోషణకై దినదిన భారంగా బ్రతుకుతున్నాను రేషన్ కార్డులో నా పేరును చనిపోయినట్లు నిర్ధారణ చేశారు ఇది రామకృష్ణ కన్నీటి బాధ. బతికున్నాను మహాప్రభో రేషన్ కార్డులో నా పేరు జతపరచాలని ఓ నిరుపేద వ్యక్తి ఎన్నో ఏళ్లుగా అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాధుడే లేక అష్ట కష్టాలు పడుతున్నాడు. మండలంలోని వేములవలసలో చాలా సంవత్సరాల నుండి అద్దె ఇంటిలో నివాసముంటున్న నిరుపేద వ్యక్తి కంటి మహంతి రామకృష్ణ (42) తన భార్య విజయలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు, తమ్ముడు, సోదరితో నివాసమంటూ కూడలిలో రిపేర్ వర్క్స్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 2018 వరకు రేషన్ కార్డులో తన పేరు ఉండేదని తన తండ్రి మరణించిన తర్వాత తాను మరణించినట్లుగా తప్పుగా నమోదు చేయడంతో రేషన్ కార్డులో తన పేరు గల్లంతైందని తన పేరును, తన కుమార్తె పేరును నమోదు చేయాలని సంబంధిత అధికారుల వద్దకు వెళ్తే నువ్వు మరణించినట్లు వస్తుందని సంబంధిత అధికారులు తెలియజేయడంతో రామకృష్ణ ఒక్కసారిగా కంగుతిన్నారు. రేషన్ కార్డులో భార్య, తమ్ముడు, సోదరి, తన కుమార్తె పేరు ఉన్నప్పటికీ తన పేరు లేకపోవడంతో పలు దఫాలు సంబంధిత కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్పటికీ ఫలితం లేకపోయిందని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తప్పిదం వలనే తాను మరణించినట్లుగా నమోదు చేయడం జరిగిందని తప్పుని సరిచేసి తన పేరుని రేషన్ కార్డులో యాడ్ చేయాలని ఆయన కోరుతున్నారు. తన పేరు మరణించి ఉన్నందున తనకు ఆరోగ్యశ్రీ కూడా లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్రతుకున్న తనకు చనిపోయినట్లు సర్టిఫికెట్ రావటం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా పరిశీలన జరిపి తాను బ్రతికున్నట్లు ధ్రువీకరించి, రేషన్ కార్డులో తన పేరుని యాడ్ చేసి ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పించవలసిందిగా ఆయన అధికారులను వేడుకుంటున్నారు.

కాసులయావ.. అక్రమాల తోవ!

- దేశపాత్రునిపాలెంలో జోరుగా అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర - పరవాడ: అక్రమ నిర్మాణాలకు జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం పెట్టింది పేరుగా మారింది. ఇక్కడ అనుమతులు లేకుండా చేపడుతున్న పనులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఎక్కడపడితే అక్కడ యదేచ్ఛగా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవలసిన వారు అందిన కాడికి దండుకోవడంతో జీవీఎంసీ భారీ ఆదాయాన్ని కోల్పోతుంది. ఇదివరకు ఒకటీ రెండుకే పరిమితమైన అక్రమ నిర్మాణాలు ఇప్పుడు పదుల సంఖ్యలో జరిగి పోతున్నాయి. ముఖ్యంగా సుబ్రమణ్య నగర్ లేఅవుట్-1 సమీపంలో ఓ రేకుల షెడ్డు, దేశపాత్రునిపాలెం శివజ్యోతి స్కూల్ సమీపంలో మరో రేకుల షెడ్డు నిర్మాణాలు ఆఘమేఘాలపై జరిగి పోయాయి. పైగా వాటికి రాత్రికి రాత్రే సున్నాలు వేసేసారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినప్పటికీ నీరు గార్చారే తప్ప ఎటువంటి చర్యలకు ప్రయత్నిం చలేదు. అలాగే ఇటు రోడ్డు విస్తరణ స్థలాల్లో జరిగే అక్రమ నిర్మాణాలను సైతం పట్టించుకోలేదు. గాజువాక-యలమంచిలి ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ స్థలాల్లో నాలుగు అనధికార షెడ్ల నిర్మాణాలు జరిగాయి. వీటిపై పిర్యాదు లున్నా స్పందించనేలేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా దృష్టి సారించకపోవడంతో జీవీఎంసీ ఆదాయా నికి భారీగానే గండిపడుతోంది. ఇదిలా ఉంటే ఈ అక్రమ నిర్మాణాలు కొందరి టౌన్ ప్లానింగ్ అధికా రులకు కాసులు కురిపిస్తున్నాయి. నిర్మాణాల ప్రారంభంలోనే ఫిర్యాదులు వెళ్తున్నప్పటికీ అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా అవి పూర్తయిన తర్వాత కుంటి షాకులతో ఫిర్యాదు దారులను పక్క దారిపట్టిస్తున్నారు. సచివాలయ సిబ్బందే ప్రభుత్వా దాయానికి అడ్డుగోడలుగా నిలుస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మా ణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం దేశాన్ని కాపాడుకుందాం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

విశాలాంధ్ర - పాయకరావుపేట: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్స వాన్ని పురస్కరించుకొని రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం - దేశాన్ని కాపాడుకుందాం అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కనీసం జీవించే మానవ హక్కులు లేని దళిత బహుజన సూద్ర జాతుల సమాజానికి ఆత్మగౌరవం, సోషల్ జస్టిస్, స్వేచ్ఛ సమానత, సౌభ్రాతృత్వం పునాదితో దేశ రాజ్యాంగంలో చట్ట బద్ధమైన మానవ హక్కులను కల్పించిన ఘనత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు దక్కిందన్నారు. అంటరాని కులాలు, తెగలు, జాతులు, మైనార్టీ ప్రజలకు ఓటు హక్కు కల్పన, కుల వివక్ష నుండి విముక్తి, సతీ సహగమనం నిర్మూలన, జాతీయ నీరు, పని, వేతనాలు, పనిగంటలు, దేశ ఆధునిక అభివృద్ధి కోసం అంబేద్కర్ జీవితాన్నే త్యాగం చేశారన్నారు. రాజ్యాగంలో కల్పించిన మానవ హక్కులను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి బానిసలు చేయడానికి కుట్రలు చేస్తుందని విమర్శించారు. దీన్ని దళిత బహుజన సమాజం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, చిరుకూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండ పంచాయతీలో జలజీవన్‌మిషన్ పనులను ఆదివారం సర్పంచ్ నడిగొట్ల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌ద్వారా ప్రతీ ఇంటికి కుళాయిల నిర్మాణం, మంచినీటి సరఫరా చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.7.5లక్షలు మంజూరు చేయడంతో ఈ పనులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా బోరు వేసి, ట్యాంక్ నిర్మించి, కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేయనుండంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి, వార్డు సభ్యులు గడుతూరి నర్సమ్మ, దారకొండ గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002- 2003 10వ తరగతి విద్యార్థులు అపూర్వ కలయిక జరిగింది. ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులైన 2003లో 10వ తరగతి చదివిన అందరూ కలవడంతో సందడి చేశారు. చదువుకున్న సమయంలో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు కూడా ఆ విద్యార్థులతో మాట్లాడి ఎవరెవరు ఏమి చేస్తున్నారని దానిపై ఆరా తీశారు. అప్పటి సీనియర్ ఉపాధ్యాయులు బొద్దపు కాశీ విశ్వనాథ్ తెలుగు పండిట్ శర్మ, బి.భాస్కరరావు తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఏడాది అయినా నెరవేరని ఎమ్మెల్యే హామీ

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని నరవ గ్రామంలో కళ్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకొస్తానన్న ఎమ్మెల్యే హామీ ఏడాదైనా నెరవేరలేదని జనసేన నాయకుడు గల్ల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలందరికీ ఉపయోగపడే కళ్యాణ మండపాన్ని సచివాలయంగా మార్పు చేసిన అధికారుల తీరును నిరసిస్తూ తాము నిరసన దీక్ష చేపట్టామని, దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పది రోజుల్లోగా కళ్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నరవ గ్రామంలో కళ్యాణమండపాన్ని ప్రజలకు అందజేయడానికి ఇటు వైసిపి నాయకులకు అటు ఎమ్మెల్యేకు ఇష్టం లేనట్లుగా ఉందని ఆయన ఆరోపించారు. తన సొంత భవనాన్ని సచివాలయానికి ఇస్తానని చెప్పినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి కళ్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ పెద్ద చెరువులో చేపల మృతికి కారణమైన రాంకీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెరువు ఆయకట్టు దారులు డిమాండ్ చేసారు. ఇటీవల ఫార్మా కంపెనీల కాలుష్యం కారణంగా పెద్ద చెరువులోని చేపలు భారీగా మృతి చెందాయి. ఈ మేరకు సంఘం ప్రతినిధులు ఆదివారం పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేసారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో చెరువు ఆయుకట్టు దారుల సంఘం ప్రతినిధులు రెడ్డి శ్రీను, పైల రామచంద్రరావు, సిరిపురపు పన్నిబాబు, చుక్క గోపి, పైల నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలను
అంకెలతో సహా వివరించే ప్రభుత్వం వైసీపీ

విశాలాంధ్ర - చింతపల్లి: చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం అంకెలతో సహా ప్రజలకు తెలిసేలా పరిపాలన సాగిస్తున్న ఏకైక ప్రభుత్వం వైకాపా అని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. తాజంగి పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్ వంతల మహేశ్వరి ఆధ్వర్యంలో వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి అధ్యక్షతన సచివాలయం 1లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె పార్టీ శ్రేణులతో కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా పరిపాలన అందించిన ఏకైక ప్రభుత్వం వైకాపా అన్నారు. అకారణంగా వచ్చిన తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు వైకాపా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు దీనిని రాద్ధాంతం చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, వైస్ ప్రెసిడెంట్ రవి, వార్డు సభ్యులు సదాశివ, వీరన్న పడాల్, మోహిని, సుభద్ర, సీనియర్ నాయకులు రామారావు, బాలబాబు, లక్ష్మణ్‌రావు, నారాయణరావు, రమణమ్మ, బాబురావు, కొండమ్మ, లక్ష్మి, బన్ను, దశరధ్, పాత తాజంగి మహిళా నాయకులు, కన్వీనర్లు, గృహసారదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మా కిష్టం



విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులచే బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

గోస్తని నదిలో పడి బాలుడు గల్లంతు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కురపల్లి గ్రామం గోస్తనీ నది వద్దా మధురవాడ గాయత్రీ నగర్ చెందిన పొన్నగంటి హరి (16) బాలుడు నదిలో కాలుజారి పడిపోయాడు. మిత్రులతో పిక్నిక్‌కు వచ్చి గోస్తని నదిలో తన మిత్రులతో కలిసి స్నానం చేస్తుండగా కురపల్లి వద్ద ఉన్న రెగ్యులేటర్ డ్యాం క్రింది భాగం వద్ద స్నానం చేస్తూ ఉండగా నదిలో హరి తన మిత్రుడు ఇద్దరూ పడిపోయారు. హరి మిత్రుడు పక్కన ఉన్న చిన్న చెట్టు కొమ్మను పట్టుకొని సురక్షితంగా బయటపడ్డాడు. హరి నది మధ్యలో కొట్టుకుపోయి నదిలో గల్లంతయ్యాడు. మృతుడి శవం ఆచూకీ ఇంకా లభించలేదని పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

ఘనంగా హై ఫీల్డ్స్ పాఠశాల 5వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - పీఎం పాలెం: హై ఫీల్డ్స్ - ఒత్తిడి లేని విద్యను అందించిన నాడే విద్యార్థినీ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ వుంటుందని విద్యాసాగర్ నాయుడు అన్నారు. హై ఫీల్డ్స్ పాఠశాల 5వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ఆదివారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేహౌండ్స్ గ్రూపు కమెండర్ వసన విద్యాసాగర్ నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. బాలాజీ విద్యాసంస్థల అధ్యక్షులైన మండవ రవికుమార్ ఈ కార్యక్రమానికి నిర్వహణకర్తగా వ్యవహరించారు. కార్యక్ర మానికి విచ్చేసిన వారిని ప్రణవాలయ నృత్య గానాలతో ఆహ్వానిస్తూ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వివిధ రకాల నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనాత్మక, కళాత్మక కార్యక్రమా లతో అలరించారు. దేశానికి వెన్నుముఖ అయిన రైతు, దేశం కోసం సరిహద్దుల్లో ప్రాణ త్యాగం చేసే సైనికుని గురించి, ప్రేమ, మానవత్వం చాటుతూ కళాత్మకంగా నాటికను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రూపు కమెండర్ గ్రేహౌండ్స్ వసన విద్యాసాగర్ నాయుడు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి వారిని అన్ని రంగాలలో చాలా చురుకు ఉండాలని, ఉత్తమ విద్యను అభ్యసించి భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మండవ రవికుమార్, డైరెక్టర్ మండవ ప్రణీత్, ప్రిన్సిపల్ మారుపూడి పద్మజ, వైస్ ప్రిన్సిపల్ రమా, విద్యా ర్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నావికాదళ దినోత్సవానికి హాజరైన ప్రముఖులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆర్‌కె బీచ్ వేదికగా ఆదివారం జరిగిన భారత నావికాదళ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు విడదల రజని(వైద్య ఆరోగ్య శాఖ), గుడివాడ అమర్నాథ్(ఐటీ, పరిశ్రమలు), అనకాపల్లి ఎంపీ సత్యవతి హాజరయ్యారు. నావికాదళ సామర్థ్య విన్యాసాలను కమాండర్ ఇన్ చీఫ్ రాజేష్ పెందార్కర్, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, ఇతర ప్రముఖులు వీక్షించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విశాలాంధ్ర - దేవీపట్నం: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక రుగ్మతలపై దేవీపట్నం ఎస్సై కెవి నాగార్జున ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఇందుకూరు పేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లలకు వాహనాలు నడపటానికి ఇవ్వరాదని, లైసెన్స్ లేకుండా వాహనాలు త్రిప్పరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కోటవురట్ల: రామచంద్రపురం శివారు అల్లు మియపాలెం సమీపం వద్ద చెట్టు పడి వ్యక్తి మృతి చెందాడు. పొందూరు గ్రామానికి చెందిన శానాపతి సత్తిబాబు (65) కూలి పనికి వెళ్లి నీలగిరి చెట్లు నరికి తాడు కట్టి లాగుతుండగా చెట్టు మీద పడి అక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. మృతుడు సత్తిబాబు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

మాడుగుల ఎంపిపిపై
కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల ఎంపిపిపై కేసు నమోదు చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు డిమాండ్ చేశారు. మాడుగులలో ఆత్మహత్యయత్నం చేసుకొని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసైనికుడు సాయిని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాడుగుల ఎంపీపీ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య పాల్పడినట్లు ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఎంపిపిని ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు. సంబంధం లేని తమ జనసైనికులను వేధింపులకు గురి చేయడం సమంససం కాదని, వెంటనే పోలీసులు ఎంపీపీపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మాడుగుల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ రాయపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు, చీరలు పంపిణీ

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట మండలం అండిబ పంచాయతీ బంగారుబుడ్డి గ్రామంలో ఆదివారం యువకులు, మహిళలు, వృద్ధులకు పేదలకు గిరిజాగృతి అసోసియేషన్ అధ్యక్షులు, అరకు అసెంబ్లీ అభ్యర్థి ఆశావాహులు మోరి సింహాచలం ఆధ్వర్యంలో చీరలు, రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం పవిత్ర కార్తీక మాసం సందర్భంగా స్థానిక శివాలయంని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులతో భజన సంకీర్తనం చేసి ఆధ్యాత్మిక కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో అరకు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, మీ దీవెనలు తనపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజాగృతి ప్రతినిధులు టి.శ్యాంసుందర్, ఎం.నూకరాజు, కే.భూషణం, బి.ప్రేమ్ కుమార్, రాజేష్, నాయకులు చంటి, మాజీ సర్పంచ్ బాబురావు, కన్నాలమ్మ, రాధమ్మ, చిన్నమ్మి, చిన్నయ్య, భీమన్న, బుల్లిబాబు, ఈశ్వరరావు, పొట్టన్న, కొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

విభిన్న ప్రతిభావంతులు అధైర్య పడకూడదు

అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : విభిన్న ప్రతిభావంతులు ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ అధైర్య పడకూడదని అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ రాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గవరపాలెం గౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. విభిన్న ప్రతిభావంతులు ఆత్మ నూన్యతా భావాన్ని దరిచేరనీయకూడదన్నారు. సమాజంలో మిగిలిన వారి వలె కార్యక్రమాలలో పాల్గొనడం చదువు, వైద్యం పొందడం లో వారికి ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతుంటాయన్నారు. కాబట్టి జీవితంలో వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ప్రతివారు వారిపట్ల సానుభూతి బదులు వారిని ప్రోత్స హించాలన్నారు. అనకాపల్లి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా నర్సీపట్నం, అచ్యుతాపురం ప్రాంతాలలో గ్రూపులుగా ఏర్పడి లోనుకు దరఖాస్తు చేశారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నానని ప్రతి ఒక్కరూ వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తు న్నాయని తెలిపారు. వాటిని పొందేందుకు అందరికీ అవగాహన కల్పించి సహాయం చేస్తున్న పి.ఎస్. తిరుపతి పట్నాయక్ కృషిని ఆయన అభినందించారు. వీరు ఏ విషయంలోనూ తక్కువ కాదని, వీరిలో కూడా అనేక ప్రజ్ఞ పాటవాలు ఉంటాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఆత్మ విశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలన్నారు. వారి పట్ల సమాజం దృక్పథాన్ని మార్చుకోవాలన్నారు. ప్రస్తుతం సెల్ ఫోన్, ల్యాప్ టాప్, కంప్యూటర్ మొదలైనవి వీరికి ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి అన్నారు. యువతీ యువకులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్ లు, వినికిడి యంత్రాలు అందచేశారు. బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలోఆర్.పి.డి. చట్టం సభ్యులు పి.ఎస్. తిరుపతి పట్నాయక్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జగదీష్, ఆర్.పి.డి. మెంబర్లు వీరు యాదవ్, రవి, అర్జునరావు, మదర్ థెరిసా సంస్థ ప్రతినిధులు కే.సన్యాసినాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కృతజ్ఞతలు తెలిపిన లంకపాకల గ్రామస్తులు

విశాలాంధ్ర - చింతపల్లి : కొమ్మంగి పంచాయతీ లోని లంక పాకల గ్రామస్తుల రహదారి కళ సాకారం కానుందని వైకాపా మండల కన్వీనర్ పాంగి గుణబాబు అన్నారు. పంచాయతీలోని లంకపాకల గ్రామంలో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిమెంటు రహదారి నిర్మాణానికి ఆదివారం ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యురాలు జర్త రూతు తో కలసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మంగి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గ్రామస్తుల అభ్యర్థన మేరకు సమస్యలు తెలుసుకున్న ఆమె ఆనాడు గ్రామస్తులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల 15 లక్షల రూపాయల వ్యయంతో సుమారు 360 మీటర్లు అదే విధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మరో నాలుగు లక్షల రూపాయలతో మరొక 100 మీటర్లతో కలిపి మొత్తం 460 మీటర్ల రహదారి నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పనులు పూర్తయి సిమెంటు రహదారి అందుబాటులోకి వస్తే గ్రామంలో రహదారి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆ పంచాయతీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, గృహ సారథి సత్తిబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పిపోయి శిశుగృహాలో ఉన్న పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేరుద్దాం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ కేంద్ర కార్యాలయ అధికారిని లక్ష్మీబాయి

విశాలాంధ్ర - చింతపల్లి : తల్లిదండ్రుల నుంచి తప్పి పోయి తమిళనాడు లోని ఎన్ జీ వో లకు చిక్కిగడచిన ఐదారు నెలలుగా విశాఖలోని వేర్వేరు శిశు గృహాలలో ఉన్న ఈ ఫోటోలలోని ముగ్గురు పిల్లలను తమ తల్లి దండ్రుల చెంతకు చేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కేంద్ర కార్యాలయ అధికారిని లక్ష్మీబాయి అన్నారు. ఆమె అందించిన వివరాల ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన అభం శుభం తెలియని చిన్నా రులు రాష్ట్రం కాని రాష్ట్రం తమిళనాడులో బిక్కు బిక్కుమంటూ తిరుగుతూ భాష తెలియక, ఏమి చేయాలో, ఎక్కడకు వెళ్ళాలో అర్ధం కానీ అయోమయ పరిస్థితిలో అక్కడి ఎన్ జీ వో లకు తారస పడితే ప్రశ్నించిన ఎన్‌జీవో లకు తమిళం తెలియని ఆ చిన్నారులు మాట్లాడే తీరుని బట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పిల్లలుగా అర్ధం చేసుకుని పంపడంతో గడచిన కొన్ని నెలలుగా ఆ చిన్నారులు ముగ్గురు విశాఖలోని వేర్వేరు శిశు గృహాలలో ఉన్నారన్నారు. వారు మాట్లాడే దాన్ని బట్టి చూస్తే పీవీటీజీ తెగకు చెందిన వారిగా అర్ధం అవుతుందన్నారు. తల్లి పేరు తానె అని, తండ్రి పేరు మచ్చయ్య అని వారి పేర్లు వైశాలి (6), సోము (4), అబ్బులు (3) లుగా చెబుతున్నారని, వీరు ముగ్గురు ఒకే తల్లి బిడ్డలని అర్థం అవుతుందన్నారు. తల్లిదండ్రుల నుంచి తప్పి పోయిన ఈ చిన్నారులు తమది చింతపల్లి, చింతాడ అని, జలపాతం చెంత తమ గ్రామమని చెబుతున్నారని, పిల్లలు తప్పి పోయిన ఎవరైనా ఆయా ప్రాంతాలలో ఉన్నట్ల యితే, లేదా అంటువంటి కేసులు ఏ పోలీస్ స్టేషన్లో నైనా నమోదు అయితే ఈ వార్తా కథనాన్ని చూసైనా ఆ పిల్లల ఆఘూకీ వారి తల్లిదండ్రులకు చేరవేసి చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముగ్గురు పిల్లలలో ఒక అమ్మాయి ఉండడంతో ఆ అమ్మాయిని విశాఖలోని బాలికల శిశు గృహాలోనూ, మిగిలిన ఇద్దరు మగ పిల్లలను మరో శిశు గృహాలోనూ వేర్వేరుగా ఉంచడం జరి గిందని, అభం శుభం ఎరుగని ఆ చిన్నారులను తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉంది

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘనలు అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయని దామోదర్ సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం వేడుకలు జరిగాయి. నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని మానవ హక్కుల గురించి వివరించారు. అందరికి- స్వేచ్ఛ- అందరికీ సమానత్వం మరియు న్యాయం అనే అంశం పై జరిగిన సదస్సులో దామోదర్ సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులను కల్పించిందన్నారు. అయితే రాజ్యాంగంలో కల్పించిన మానవ హక్కులను నేడు ప్రభుత్వాలు తమ అధికార దుర్వినియోగంతో వాటికి భంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగానికి శాసనానికి బద్ధుడినై పనిచేస్తానని ప్రమాణం చేసిన వ్యక్తులే వాటిని ఉల్లంఘిస్తున్నారని అన్నారు. రాజ్యాంగం ప్రజలకు భావవ్యక్తీకరణ, నిరసన తెలిపే స్వేచ్ఛ కల్పించిందన్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసిందని సత్యనారాయణ తెలిపారు. అయితే భావవ్యక్తీకరణ నిరసన తెలిపే స్వేచ్ఛను కాదనే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ రెండు హక్కులు హరించబడ్డాయని తెలిపారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించినా, నిరసన తెలిపిన తక్షణమే ప్రభుత్వం పోలీసులు, సిఐడి పోలీసులతో కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తుందని సత్యనారాయణ అన్నారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను ఏలే పాలకులే ఉల్లంఘించడంతో ప్రజలకు ఈపరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తాము నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. తమ హక్కులకు భంగం కలిగితే ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. 1993లో అమల్లోకి వచ్చిన మానవ హక్కుల పరిరక్షణ చట్టం సత్ఫలితాలు ఇస్తోందని తెలిపారు. అనంతరం హ్యూమన్ రైట్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జగన్మోహన్ రావు మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో రాజీ పడకుండా పనిచేస్తున్నామని చెప్పారు. బాధితుల పక్షాన నిలబడి పోరాడి ఎన్నో విజయాలు సాధించామని తెలియజేశారు...బోర్డు ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా చైర్మన్ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ కె.సీత మాణిక్యం మాట్లాడుతూ స్త్రీ పురుషులు మధ్య నిజమైన సంఘీభావం మరియు సౌభ్రాతృత వాతావరణం ఉండాలని అన్నారు. శతశాతం ప్రజల్లో మానవ హక్కుల పై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ పోలీసు అధికారి వై.ప్రేమ్ బాబు మాట్లాడుతూ ఈ రోజు వైకల్యాలున్న వ్యక్తులు, స్థానిక ప్రజలు మరియు వలసదారులు వంటి బలహీన సమూహాలపై మానవహక్కుల కౌన్సిల్ కృషి చేయాలని కోరారు..మానవ హక్కుల ప్రతినిధులు ఎస్వీ రమణ, సోమసుందర రావు, బి.మల్లేశ్వర రావు, నక్కాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర - విఆర్.పురం : అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు సబ్ డివిజన్ విఆర్ మండల హిందూ సమ్మే ళనం 17/12/2023 రేఖ పల్లి లోని కోట మైసమ్మ దేవాలయం ప్రాంగణంలో సమ్మేళన కార్యక్రమం నిర్వహించబడుతుందని మండల ధర్మ ప్రచారక్ ముత్యాల శ్రీ రామకృష్ణయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు మండలంలోని బీసీ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ సన్నిధిలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ, పంచాయతీ కమిటీలు చింతూరు సబ్ డివిజన్ ధర్మ ప్రచార్ కరి చిన్న శ్రీనివాసరావు అలజంగి నాగేశ్వరావు గూటాల పుల్లష్ శాంతమ్మ రామతులసిగా గోబేరు పవన్‌కుమార్ కరపత్రములు ఆవిష్కరణ నిర్వహించారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచాలి

విశాలాంధ్ర - చీడికాడ : బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాకా వెంగళరావు అన్నారు మండల కేంద్రంలోని తులసి కళ్యాణ మండపంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు ఆధ్వర్యంలో ఆదివారం సమా వేశం నిర్వహించారు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీలకు 275 ఎంపీలు 90 ఎమ్మెల్యే షీట్‌లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిం చాలన్నారు బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలన్నారు వారికి అన్యాయం జరిగిన వారిపై దాడులు జరిగిన తాము వారి వెంట ఉంటామని తెలిపారు ప్రభుత్వం కుల జనగన నిర్వహించి నిష్పత్తి ప్రకారం షీట్‌లు కేటా యించా లన్నారు. రామానాయుడు మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీరామారావు హయాంలోనే బీసీలను ఎమ్మెల్యే చేసిన ఘనత టీడిపికి దక్కిందన్నారు ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు ఏ.నూకాలమ్మ వై.నాగేశ్వరావు ఏ నరసింహారాజు కె.అప్పలరాజు తదితరులు పాల్గున్నారు

స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

విశాలాంధ్ర - భీమిలి : కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సహా యంతో, మహిళా ఆరోగ్య వికాస్ వారి సహకారంతో, మెగా ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం, భీమిలి కలిగొట్ల సిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వారు ఆదివారం విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గరికవలస గ్రామంలో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలలో ఉండే గర్భాశయ వ్యాధులను గుర్తించడానికి 99 శాతం ఖచ్చితమైన ఫలితాన్నిచే పరీక్షను వికాస్ తరంగిణీ వారు 14 మంది మహిళా డాక్టర్లచే సుమారు 250 మంది మహిళలకు ఉచితముగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు కూడా ఉచితముగా పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధులుగా విజయనగరం పార్ల మెంట్ సభ్యులు బెల్లాన. చంద్ర శేఖర్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి. శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గారు, మరియు గరికవలస మాజీ చైర్మన్ బెల్లాన వెంకటరమణ, మరియు బెల్లాన జగన్నాదం, విజయనగరం చైర్మన్ బంగారునాయుడు,చిన జీయర్ స్వామి ఆరోగ్య వికాస్ కన్వీనర్ లత, మరియు వికాస్ తరంగిణి కన్వీనర్ శ్రీనివాస్ వర్మ, మరియు కలిగొట్ల బాబ్జి గారు, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, మరియు ఫౌండేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

300 మందికి ఉచిత ఆరోగ్య సేవలు

విశాలాంధ్ర - దేవీపట్నం : రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రీ వారి అధ్వర్యంలో రాంపా చోడవరం శివారు సిరిగిందల పాడు లో ఆదివారం ప్రత్యేక వైద్య శిభిరం నిర్వహించి నట్లు కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసినారు. ఈ వైద్య శిభిరం పాడు రామకృష్ణా మిషన్ మేనేజర్ స్వామీ రఘువీరనంద మహరాజ్, మెడికల్ క్యాంపు పాడు పాల్గొని మెడికల్ క్యాంపు సేవలను పరిశీలించారు. డాక్టర్ గోలి వెంకట రామారావు డా.కస్తూరి సుబ్రమణ్యం డా.శ్రీకృష్ణ పాతూరి డా.టి.వి.సుబ్బారావు డా.రాయుడు శ్రీనివాస్ డా' ఎస్. సంపత్ కుమార్ మరియు జి.యస్. ఎల్.డాక్టర్స్ పాల్గొని సుమారు 300మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియ చేసినారు అవసరం అయిన వారికి 82 మందికి రక్తపరీక్షలు 14 మందికి థైరాయిడ్ పరీక్షలు 8 మందికి ఇ.సి.జి లు 22 మందికి ఎక్స్‌రేలు, 02 ఫిజియథెరపీలు చేసినట్లు స్వామీజి తెలిపినారు. మరియు వేమాగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహించి 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరము అయిన వారికి 10 మందికి కళ్లజోళ్లు .ఏడుగురిని కంటి ఆపరేషన్లు నిమిత్తం వెమగిరి పరమహంస యోగానంద కంటి ఆసు పత్రికి తరలించినారు. రామ కృష్ణ మిషన్ అంది స్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ చెప్పినారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ వాలంటీర్స్ ఎల్. జి.బి.భగిరథ రాజు. ఉదయ్ కిరణ్. మంగి రెడ్డి రాము చంద్రం మరియు సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు సహాయ కులుకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.

టైకూన్ జంక్షన్ వద్ద జనసేన నేడు మహాధర్నా

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రహదారి మూసివేతకు నిరసనగా టైకూన్ జంక్షన్ వద్ద పార్టీలక తీతంగా జనసేన నేతృత్వంలో నేడు మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం జీవీఎంసీ గాంధీ విగ్రహ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైకూన్ హెూటల్ కూడలి వద్ద వైసిపి ఎంపి ఎం.వి.వి భవన నిర్మాణాలు కోసం ఉన్న రోడ్డును మూసి వేయడం అన్యాయమన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించకోకపోవడం దారుణం అన్నారు. టైకూన్ జంక్షన్‌ను ఎంపీ కోసం ఇష్టం వచ్చినట్లు మూసివేయడం అధికార దుర్వినియోగం కాదాఅని నిలదీశారు. ఆ ప్రాంతాన్ని జనసేన నేతలు సందర్శించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు చేశారని మండి పడ్డారు. ఈ మహా దర్నాకు నాదెండ్ల మనోహర్ తో సహా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్లు, కార్పోరేటర్లు హాజరవుతున్నారని వెల్లడించారు. అక్రమ అరెస్టులకు భయపడకుండా ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త పి వి ఎస్ ఎన్ రాజు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, రాష్ట్ర కార్యదర్శి అంగా ప్రశాంతి, ప్రాంతీయ సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, కిరణ్ ప్రసాద్, త్రివేణి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయ ప్రాంగణము నందు మెడి కవర్ వైద్య బృందం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించింది. వైద్యులు డాక్టర్ తరుణ్, డాక్టర్ ధనుష్ ఆర్గనైజర్ వి నాయుడు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు అందించారు. గ్రంథాలయ అధికారిని బి.సూర్య కళ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ స్థానిక కార్పొరేటర్ పీల శ్రీనివాసరావు పాల్గొని ఆరోగ్యమే మహాభాగ్యం అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దాడి రమణ చిట్టి పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ సరగడం నరసింహమూర్తి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో బిపి షుగర్, ఈసీజీ టెస్ట్ లు చేసి ఉచితంగా మందుల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు కార్యదర్శి ఆదారి రామకృష్ణ కోశాధికారి పెంటకోట గణేష్ సూరిశెట్టి గణేష్ శరగడం అప్పారావు శరగడం రమణ డి.దేవుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ, 92 వ వార్డు పద్మనాభ నగర్ లో బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్య క్రమం స్థానిక మహిళా మండలి ఆధ్వ ర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నందవరపు సోములు ప్రసంగిస్తూ సంక్షేమం అభివృద్ధి పై దూరదృష్టి ఉన్న చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా చేపట్టనున్న మహాశక్తి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత పథకాలతో పాటు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందించే విధంగా ప్రణాళిక రూపొం దించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ప్రసంగిస్తూ వైసిపి పాలనలో ఇచ్చింది గోరంత దోచుకుంటుంది కొండంతని కొద్ది మందికి మాత్రమే సంక్షేమ పథకాలు ఇచ్చి అందరి దగ్గర నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెంచి ఇంటి పన్ను, చెత్త పన్ను, కరెంటు బిల్లులు పై ఇలా అన్నింటిపై పన్నులు పెంచి పెంచి ప్రజల నుండి పిండుతున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - భీమిలి : హక్కులు లేని మనిషి బానిసతో సమానమని, స్వతంత్రంగా జీవిస్తూ తన మనుగడ కాపాడుకోవాలంటే తప్పనిసరిగా హక్కులు ఉండాలని వాటిని పరిరక్షించ వలసిన అవసరాన్ని నొక్కి చెప్పే దినోత్సవం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం అని డైట్ వైస్ ప్రిన్సిపాల్ కొట్టేటి రవి అన్నారు. ఆదివారం జిల్లా విద్యా శిక్షణ సంస్థలు మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న పారిస్ వేదికగా మానవ హక్కుల ప్రకటన ఐక్యరాజ్యసమితి చేసిందని అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా నిర్వహి స్తున్నారని అన్నారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఇన్ని ప్రయత్నాలు చేస్తున్నా, ఏదో ఒకచోట మానవ హక్కుల అణిచివేత జరుగుతూనే ఉందని, వీటిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్య దేశాలలో కూడా మానవ హక్కుల హననం జరుగుతూనే ఉందని దీనిని తగ్గించాలి అంటే యువతలో మానవ హక్కుల పట్ల సరైన అవగాహన ఉండాలని, ప్రతి ఒక్కరూ జీవించే హక్కును గౌరవించాలని అన్నారు. అందుచేతనే భారత దేశంలో మానవ హక్కుల పరిరక్షణ చట్టాన్ని 1993లో ఆమోదించారని, అదే ఏడాది మానవ హక్కుల కమిషన్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు మానవ హక్కుల పరిరక్షణ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకురాలు పేట హరిని తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పించండి అభివృద్ధి చేసి చూపిస్తా

బీజేపీ అరకు పార్లమెంట్ నాయకుడు డాక్టర్ హేమానాయక్

విశాలాంధ్ర - చింతపల్లి : అరకు పార్లమెంట్ నియోజక వర్గంలో పార్లమెంట్ సభ్యునిగా అవకాశం కల్పిస్తే అరకు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని భారతీయ జనతా పార్టీ అరకు పార్లమెంటు నాయకుడు డాక్టర్ వి హేమా నాయక్ అన్నారు. ఆదివారం చింతపల్లి వచ్చిన ఆయన పలువురు పార్టీ శ్రేణులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌగోళికంగా విస్తీర్ణంలో ఎంతో విశాలమైన అరకు పార్లమెంటు నియోజకవర్గం సహజ సిద్ధ వనరుల సమాహారం అన్నారు. ఇటువంటి ఎన్నో వనరులున్న ఈ నియోజక వర్గం అభివృద్ధి విషయంలో పాలకుల ఉదాసీనత కొట్టొచ్చినట్లు కనపడుతుందన్నారు. ముఖ్యంగా అభివృద్ధికి అవసరమైన రహదారులు, కనీస మౌలిక వసతులైన త్రాగునీరు విద్యా వైద్యం తదితర నాలుగు సమస్యలను కూడా పరిష్కరించలేకపోవడం పాలకుల వైఫల్యం అన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ళు పూర్తి కావస్తున్నప్పటికీ నేటికీ కనీస మౌలిక సదుపాయాలు లేని ప్రాంతంగా ఈ ప్రాంతం ఉందంటే గతంలో ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించిన పార్లమెంటు సభ్యులు ఆత్మావలోకనం చేసు కోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రణాళిక లేకపోవడమే అభివృద్ధికి ఆటంకం అయిందేమోనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అరకు పార్లమెంటు పరిధిలో క్షేత్రస్థాయి నుంచి తాను ప్రజా సమస్యలపై అధ్యయనం చేశానని రాబోవు ఎన్నికలలో అరకు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఈ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈసారి తనకు అవకాశం కల్పించి ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - భీమిలి : భీమునిపట్నం పరిధిలో ఉన్న భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎంపాలెం పోలీస్ స్టేషన్ లో వివిధ కేసులను భీమిలి కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 389 కేసులు పరిష్కారమయ్యాయి. ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో, అలానే రెండవ అదనపు జూనియర్ సివిల్ ఇన్చార్జ్ జడ్జ్ గాను పాల్గొని ఈ రెండు కోర్టు లోను 251 కేసులు పరిష్కారమయ్యాయి. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో జడ్జ్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 138 కేసులు పరిష్కారమ య్యాయి. ఇందులో నాలుగు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన పోలీసు అధికారులు, లోక్ అదాలత్ సభ్యులు డి.ఈశ్వరరావు, ఎం.వి పార్వతీశం, లాయర్లు పాల్గొన్నారు.